క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ మిల్క్ ప్రాజెక్ట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఈద్గా మహల్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో శనివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సౌమ్య థియేటర్ ప్రాంతం, హాస్టల్ రోడ్, గాంధీబొమ్మ సెంటర్, లంబాడీపేట, ఫైర్‌స్టేషన్ ప్రాంతం, లలితా బార్ ఎదురుగా, కుండల మార్కెట్, చిట్టిగారి పార్క్ తదితర ఏరియాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయకు చెందిన కళాకారులు శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై ఎం.గేయ అక్షిత పర్యవేక్షణలో 22మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్యప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

మజ్జిగ పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా 47వ డివిజన్ పరిధిలోని సీఎస్ఐ క్రీస్తు ప్రార్థనా మందిరం వద్ద టేనర్‌పేట యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు తాండ్ర ఇంద్రకుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. సంఘ పెద్దలు ఆర్.మైకేల్, ఆర్ ప్రభుదాస్, ఆర్.దావీదు, యూత్ సభ్యులు సీహెచ్ రవి కుమార్, టి.ఆనంద్‌కుమార్, ఎస్.యేసోబు, వై రాజేష్, సీహెచ్ గోపి, పి.ప్రవీణ్, వి.కొండ, జి.సాల్మన్‌రాజు, ఎ జోన్ పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రేమపేరుతో యువతిని నమ్మించి డబ్బులు కాజేసిన వ్యక్తిపై భవానిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఎంబీబీఎస్ పూర్తిచేసిన భవానిపురానికి చెందిన ఓ యువతికి రెండేళ్ల కిందట లబ్బీపేట పైడయ్య వీధికి చెందిన డి.సాయివెంకటశివకుమార్ ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం అయ్యాడు. ఆమెను ప్రేమించానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. తన ఇంట్లో పరిస్థితులు బాగాలేవని, అప్పుచేశానని నమ్మబలికాడు. బండి తాకట్టు పెట్టానని చెప్పి ఆమె నుంచి రూ.3.50లక్షలు తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత ఆ డబ్బుల గురించి అడగగా తనను పెళ్లి చేసుకోవాలని, ఆ తర్వాత డబ్బులు ఇస్తానని ఆమెపై ఒత్తిడి పెంచాడు. మెడిసిన్‌లో పీజీ కోర్సు పూర్తయ్యాక పెళ్లి చేసుకుందామని చెప్పగా, అతని తండ్రి వెంకటప్పయ్య, తల్లి పూర్ణకుమారి, అక్క హారిక కలసి సదరు యువతిపై ఒత్తిడి పెంచి డబ్బులు ఎగ్గొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సదరు యువతి ఉంటున్న హాస్టల్ వద్దకు వెళ్లి శివ కుమార్ గొడవ చేశాడు, ఆమెను కొట్టడంతోపాటు డబ్బులు ఇవ్వను.. చేతనైంది చేసుకో అంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు భవానిపురం పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేసింది. ఆమె పిర్యాదు మేరకు సాయి వెంకట శివ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిలిచిన రోడ్డు పనులను పూర్తి చేయాలి



వించిపేట(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజవర్గ పరిధిలోని 50వ డివిజన్ నన్నేసాహేబ్ వీధిలో మధ్యలో నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేషన్ అధికారులు వెంటనే పూర్తిచేయాలని 50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ నేతలు స్థానికులతో కలసి నన్నేసాహేబ్ వీధిలో ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. అధికారులు స్పందించి నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను త్వరతగతిన పూర్తిచేయాలని కోరారు. లేనిపక్షంలో సోమవారం కమిషనర్‌ను కలిసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రాజు, గురవప్పా, శ్రీను, పి.పృథ్వీరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో అడుగడుగునా ఆక్రమణలు

- భారీగా అక్రమ దుకాణాల ఏర్పాటు
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారం
- నడిచేందుకు కూడా వీలులేని వైనం
- మహిళలకు తప్పని తిప్పలు
- చోద్యం చూస్తున్న ఎస్టేట్ అధికారులు



కేదారేశ్వరపేట రైతుబజారు నడకదారిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కేదారేశ్వరపేట రైతుబజార్‌లో అడుగడుగునా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ఎస్టేట్ అధికారులు కేటాయించిన దుకాణాల కంటే అధికసంఖ్యలో ఆక్రమణదారులు అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో రైతుల అమ్మకాలకు గండికొడుతున్నారు.

450కి పైగా అనధికార దుకాణాలు..

రైతుబజార్‌లో సుమారు 150 దుకాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వగా, అనధికారికంగా 450కి పైగా దుకాణాలు వెలిశాయి. ఎన్‌డీఏ కూటమి నాయకుల అండదండలతో ఈ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. అనధికారిక దుకాణాల కారణంగా తమ బేరాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నడిచేందుకు దారి కూడా కష్టమే..

ఆక్రమణల కారణంగా ఈ రైతుబజారులో అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి నెలకుంది. కేటాయించిన దుకాణాలకు మించి ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో మార్కెట్‌లో అటు, ఇటు నడవలేని పరిస్థితి కూడా లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. మహిళలకు మరింత ఇబ్బందిగా ఉంటోందని, ఇరుకు దారుల్లో నడవాలంటేనే అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. మార్కెట్‌లో వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసిన దుకాణాలలో విక్రయాలు చేయకుండా రైతులంతా ముందు భాగంలోనే విక్రయిస్తుండటంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది.



రైతుబజారులో నడిచేందుకు కూడా దారి లేని పరిస్థితి



వెనుకవైపు ఖాళీగా ఉన్న దుకాణాలు

పట్టించుకోని ఎస్టేట్ అధికారులు...

పలువురు వ్యక్తులు రైతుమార్కెట్‌లో అనధికారిక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నా ఎస్టేట్ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఇటు రైతులు, అటు వినియోగదారులు మండిపడుతున్నారు. అనధికారిక దుకాణాల ఏర్పాటుతో నిజమైన రైతులు నష్టపోతున్నామని, రూరల్ మండలాల నుంచి ఆటోలు, బస్సుల ద్వారా అనేక వ్యయప్రయాసలకోర్చి సరుకును రైతు బజారు వరకు తీసుకువచ్చినా చివరికి తమకు నష్టాలే మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎస్టేట్ అధికారులు తగిన చర్యలు తీసుకుని అనధికారిక విక్రయదారులను అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

నడక దారి కూడా లేదు



కేదారేశ్వరపేట రైతుబజారులో నడిచేందుకే దారి ఉండటం లేదు. కూరగాయలు కొనుగోలుదారులు ఒకరికొకరు తోసుకుంటూ ముందుకు నడవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కూరగాయలు కొనేందుకు రైతుబజారుకు రావాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది.

– దేవి, వినియోగదారు

అన్నీ ఆక్రమణలే



రైతుబజారులో కేటాయించిన దుకాణాలుపైనా ఉంటే ఫుట్‌పాత్‌లపై కూడా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో అసలు షాపుల కంటే ఈ ఆక్రమణదారుల షాపులే అధికంగా ఉన్నాయి. దీంతో మార్కెట్‌లో నడవాలంటేనే ఊపిరాడని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితి మారాలి.

– వెంకటరెడ్డి, వినియోగదారుడు

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు ..

రైతుబజారుకు వచ్చే వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటాం. వేసవి ఎండలకు కూరగాయలు పాడవుతాయనే ఉద్దేశంతో రైతుబజార్‌లోని వెనుకవైపు దుకాణదారులు ముందువైపునకు వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తగిన చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– రమేష్‌బాబు, ఎస్టేట్ ఆఫీసర్

విజయవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): టీచర్లకు వేసవి సెలవుల్లో జరిపే బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే మెడికల్‌క్యాంపును విజయవాడలోనే నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్యలు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డీఈవోలను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, దివ్యాంగులు తదితరులను గుర్తించడానికి ఈనెల 24, 25, 26 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జనరల్ హాస్పిటల్‌లో ప్రభుత్వం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులులో ఉమ్మడి కృష్ణా జిల్లాలో బందర్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. కానీ ఉపాధ్యాయ బదిలీల విధానం కౌన్సెలింగ్ సిస్టమ్ ద్వారా జరుగుతున్న 1998 నుంచి విజయవాడలో సైతం మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి క్యాంపులు జరుపుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, దివ్యాంగులు సర్టిఫికెట్ తెచ్చుకొను నిమిత్తం చాలా వ్యయప్రయాసలు పడి 24, 25, 26 తేదీల్లో మచిలీపట్నం వెళ్లవలసిన పరిస్థితి ఉందన్నారు. దీనివలన తీవ్రమైన ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి బందర్‌తో పాటుగా విజయవాడలోనూ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు.

సీఎం చంద్రబాబు ముస్లింల ద్రోహి



వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న ముస్లింలు



పంజా సెంటర్‌లో మానవహారాన్ని నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ముస్లిం నాయకుల మండిపాటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి జాతీయ రహదారి మీదుగా భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ దర్గా వరకు 'సే నో టు వక్ఫ్ బిల్' అంటూ నిరసన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ర్యాలీలో కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, ఎండీ ఇర్ఫాన్, షేక్ హయత్ షరీఫ్, బోయి సత్యబాబు, సీపీఐ(ఎమ్ఎల్) నాయకుడు ఖాదర్ బాషా, ముస్లింలు పాల్గొన్నారు. వక్ఫ్‌ను రాజకీయం చేయవద్దని, వక్ఫ్ సవరణ చట్టాన్ని అందరూ వ్యతిరేకించాలంటూ నినాదాలు చేశారు. కార్పొరేటర్లు రెహమతున్నీసా, ఇర్ఫాన్ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింలకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ, జనసేన పార్టీలు పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయంలో ముస్లింలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం భారత రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె నజీర్, వాజిద్, ఎస్‌కె జిలాని, ఎస్‌కె ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ద్వారా ప్రవేశపెట్టి చట్టం చేసిన వక్ఫ్‌బోర్డు సవరణను రద్దు చేయాలని జమాత్ ఇస్లాం హింద్ పశ్చిమ అధ్యక్షులు మొహమ్మద్ షబ్బీర్ అహ్మద్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. వివిధ ముస్లిం ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వక్ఫ్‌బిల్లు సవరణను వ్యతిరేకిస్తూ స్థానిక పంజా సెంటర్‌లో శుక్రవారం మధ్యాహ్నం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బిల్లును తీసుకొచ్చిందన్నారు. దీనిని సుప్రీంకోర్టు సైతం తప్పుపట్టిందన్నారు. ఇటువంటి ముస్లిం హక్కులను కాలరాసే బిల్లుకు రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మద్దతు ఇవ్వటం దుర్మార్గమని పేర్కొన్నారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు మత విద్వేషాలను రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ఈ విధమైన సవరణలు చేపడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వాజిద్ ఖాన్, ఎండీ ఖమర్, ఫరూక్, సమద్ అజ్మి, రిజ్వాన్ ఖురేషి సీపీఎం కార్పొరేటర్ బి సత్తిబాబు పాల్గొన్నారు

దేవస్థానం మాజీ కోశాధికారి శ్రీధర్‌కు పలువురు నివాళి



భోగవల్లి శ్రీధర్ (ఫైల్)

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): నగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థాన మాజీ కోశాధికారి, కార్యవర్గ సభ్యుడు భోగవల్లి శ్రీధర్ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కేఎల్‌రావు పార్కు సమీపంలోని నివాసంలో శుక్రవారం ఆయన పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. 2008 నుంచి దేవస్థానంలో కీలకమైన పలు పదవులతో పాటు ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. భోగవల్లి శ్రీధర్ మరణవార్త తెలుసుకున్న దేవస్థాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. భోగవల్లి శ్రీధర్ ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నూకల మధుకర్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, పలువురు పార్టీ నేతలు నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం ఆయన నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభం కాగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటంగా 'సుజనా సుజల' చలివేంద్రాలు



ఎర్రకట్టరోడ్డులో గ్లాసు నీరు కూడా అందుబాటులో లేకుండా ఉన్న చలివేంద్రం

వించిపేట(విజయవాడపశ్చిమ):పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు ప్రచార అర్భాటాలుగా మారుతున్నాయి. ప్రారంభం రోజున హడావుడి చేసి మజ్జిగ, చల్లటి తాగునీరు అందించి పెద్దగా ప్రచారం చేసుకుంటున్నారు. మరుసటి రోజు నుంచే ఆ చలివేంద్రాలలో గ్లాసు నీరు కూడ దొరకని పరిస్థితి నెలకుంటుంది. ఎండ వేడిమి తట్టుకోలేక పాదచారులు, వాహనదారులు ప్రారంభమైన చలివేంద్రాలలో చల్లటి నీరు దొరుకుతుందనే ఆశతో వచ్చి అక్కడ ఏమి లేక పోవడంతో ఎండిన గొంతుతోనే నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఈ కోవలోనే పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి చిట్టినగర్, ప్రైజర్‌పేట, ఎర్రకట్టరోడ్డులో అంబేడ్కర్ జయంతి రోజున 'సుజనా సుజల' పేరుతో చలివేంద్రాలను ఏర్పాటు చేసి కార్యకర్తలతో హడావుడి చేశారు. మరుసటి రోజు నుంచే వాటిలో తగిన నీరు ఏర్పాటు చేసే వారే కరువయ్యారు. దీంతో ప్రచారం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశారే తప్ప ప్రజల అవసరాలకు కోసం కాదంటూ ప్రజలు మండిపడుతున్నారు.

26 నుంచి ఏఐఎస్ఎఫ్ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల కరపత్రం విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు కడపలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయి కుమార్ తెలిపారు. హనుమాన్‌పేటలోని సీపీఐ భవన్‌లో శుక్రవారం శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తల్లికి వందనం ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులలో అన్ని అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్, జగదీష్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిమార్గంలో పయనించాలి

- కార్మెల్ నగర్ విచారణ గురువులు ఫాదర్ బుర్రి జాన్‌పీటర్
- ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

గుణదల (విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో పయనించాలని కార్మెల్ నగర్ విచారణ గురువులు ఫాదర్ బుర్రి జాన్‌పీటర్ చెప్పారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేలాది మంది క్రైస్తవులు ప్రధానాలయం నుంచి కొండ శిఖరాగ్రం వరకు సిలువ యాత్ర చేశారు.

దివ్యబలిపూజ..

పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సమష్టి దివ్యబలి పూజ చేశారు. రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం రాజు భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. ఎడ్యుకేషనల్ డెస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలగాని మరియన్న, సహాయ గురువులు బాలస్వామి, ఫాదర్ ప్రతాప్, మఠకన్యలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

భక్తుల భారాన్ని మోసేందుకే ఏసు సిలువ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తన భక్తుల భారాన్ని మోసేందుకు ఏసుక్రీస్తు సిలువ ధరించారని, తద్వారా ఆయనను నమ్మిన భక్తులకు స్వస్థత చేకూర్చారని పలువురు క్రైస్తవ గురువులు పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే వేడుకల్లో భాగంగా సెయిట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు శుక్రవారం ఉదయం వన్‌టౌన్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. చర్చి గురువులు మాట్లాడుతూ ఇతరులకు కీడు తలపెట్టవద్దని, సర్వమానవాళిని ప్రేమతో ఉండాలని సూచించారు.

త్యాగాలను స్మరించుకుంటూ ..

ప్రదర్శనలో భాగంగా ఏసుక్రీస్తు శిలువ వేసిన విగ్రహాన్ని అందంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగింపుగా ముందుకు సాగారు. ఈ ప్రదర్శనలో వందలాది మంది ప్రార్థనలు చేస్తూ నడిచారు. వన్‌టౌన్‌లోని ఆయా కూడళ్ల వద్ద ఆగి ఏసుక్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తిగీతాలను ఆలపించి ఆ తరువాత ముందుకు సాగారు. తారాపేటలోని చర్చి ప్రాంగణం నుంచి ప్రారంభమైన ప్రదర్శన నెహ్రూరోడ్డు, టెలిగ్రామ్ ఆఫీస్ రోడ్డు. బాబురాజేంద్రప్రసాద్‌రోడ్డు, కేటీరోడ్డు, కోమలవిలాస్ సెంటర్, నెహ్రూబొమ్మ సెంటర్, గణపతిరావు రోడ్డు, పంజా సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి చర్చి ప్రాంగణానికి చేరుకుంది.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని భవానీపురం చర్చి సెంటర్‌లోని అద్భుత బాల యేసు పుణ్యక్షేత్రం జోజినగర్ ఆర్‌సీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశుద్ధ సిలువ మార్గం నిర్వహించారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోని ఆర్‌సీఎం దేవాలయం నుంచి సిలువ మార్గం ఊరేగింపు నిర్వహించారు. విద్యాధరపురం సితార జంక్షన్ వద్ద జోజినగర్ విచారణ గురువులు ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప మాట్లాడుతూ సర్వమానవాళిపట్ల యేసు చూపిన ప్రేమకు నిదర్శనమే సిలువ మార్గమన్నారు. ఫాదర్ పీ సుధాకర్, ఉపదేశకులు, కౌన్సిల్ మెంబర్స్, దళ సభ్యులు, విన్స్ అండ్ పాల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పెజ్జోనిపేట, మరియమాత మోక్షారోపణ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి)కు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభువైన ఏసు క్రీస్తు సర్వమానవాళి రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన ఘట్టాలను వివరించారు. తొలుత దివ్యబలి పూజ చేశారు. అనంతరం బహిరంగ సిలువ మార్గంను ఖుద్దుస్‌నగర్ నుంచి శాంతినగర్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి సంఘ విచారణ గురువులు ఫాదర్ జెమ్స్, శౌరి, మాథ్యూస్, చర్చి కౌన్సిల్ సభ్యులు మరియన్నబాబు, జోషఫ్, అబ్రహం, కాళ్ల విజయ్, రాజేంద్రప్రసాద్, సహాయ రాజు పాల్గొన్నారు.



సిలువ మార్గంలో పాల్గొన్న మఠకన్యలు



క్రీస్తు శిలువను ముద్దాడుతున్న గురువులు



ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



అద్భుత బాలయేసు దేవాలయంలో ప్రసంగిస్తున్న ఫాదర్ చిన్నప్ప



పెజ్జోనిపేటలో శిలువ మార్గంలో పాల్గొన్న క్రైస్తవులు

డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని డిమాండ్

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జీ కోటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన ఖాతాదారులందరికీ న్యాయం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ 96 సంవత్సరాల చరిత్ర గలిగిన పాతబస్తీలోని దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ లైసెన్సును రద్దు చేస్తూ ఆర్‌బీఐ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఐదు లక్షలు లోపు డిపాజిట్ దార్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (ఈఐఈఏఈ) ద్వారా చెల్లించటం మంచిదేనన్నారు. అయితే బ్యాంక్‌కు చెందిన రూ.67 కోట్లు డిపాజిట్లు జాతీయ బ్యాంకులు, గవర్నమెంట్ సెక్యూరిటీస్‌లో ఉండగా, మొత్తం 11 వేల డిపాజిటర్లకు బ్యాంకు చెల్లించవలసినది సుమారు రూ.56 కోట్లు మాత్రమేనన్నారు. మొత్తం అందరికీ చెల్లించగా ఇంకా మిగిలే ఉంటుందన్నారు. ఐదు లక్షలపై నుంచి సుమారు రూ.50 లక్షల వరకు డిపాజిట్ దారులు 298 మందికి చెల్లించవలసినది రూ.30 కోట్ల లోపు మాటేనన్నారు. వారికి ఎప్పుడూ, ఎలా చెల్లిస్తారు? చెప్పవలసిన అవసరం లిక్విడేటర్, కోపరేటివ్ శాఖ అధికారుల పైన ఉందన్నారు. వారు ఆ విధంగా తెలియజేసి డిపాజిట్ దారుల ఆందోళన తొలగించవలసిందిగా కోరారు. పేద మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని లోన్లు తీసుకున్నవారికి వడ్డీలో మినహాయింపు ఇచ్చి ఆదుకోవాల్సిందిగా కోరారు. బ్యాంకు ఉద్యోగస్తులను ఆదుకోవాలి సూచించారు. బ్యాంకు ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. నగర పార్టీ సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై సదస్సు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వంటింటి వ్యర్థాలతో కూరగాయలు పెంచటం, పర్యావరణ పరిరక్షణపై స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు నాగేశ్వరరావు, సురేష్‌బాబు, నాగేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ హాజరుకావాలని వారు కోరారు.